

# విజ్ఞుడు

రాంబాబు

'అతను' అంటే మా దూరపు బంధువుల్లో అబ్బాయి. వాళ్ళు చాలాకాలం నుంచి బొంబాయి ప్రాంతాల్లోనే స్థిరపడిపోవటం మూలాన్ని, అతనిగురించి ఎప్పుడూ వినటమే కాని, చూడటం పడలేదు. అతనిని మొదటిసారిగా వాళ్ళ అక్క పెండ్లిలో కలుసుకున్నాను.

మేడమీదికి వెళ్ళేసరికి గదిలోంచి ఎవరో మాట్లాడుతున్న ధ్వని వినిపిస్తోంది. మగ గొంతుక. గది గుమ్మం ఇవతల నిలబడ్డాను. అతను ఏదో చెప్పుకుపోతున్నాడు. "...... నాకు చరిత్ర, పాలిటిక్స్ అంటే వళ్ళు మంట. ఎవరికున్నది వాళ్ళకి చాలదు. ఇతరులదాని కోసం ప్రాకులాట. దానితో యుద్ధాలు! అసలు దేనికో దానికి ఒకళ్లతో ఒకళ్ళు కొట్టుకోకపోతే తప్ప ప్రజలకి తోచదని నా అభిప్రాయం. టేక్ ఫర్ ఇన్‌స్టెన్స్— మొగుడు, పెండ్లాం ఉన్నారనుకోండి. వాళ్ళు ఒక్క వారం రోజులు పొత్తుగా ఉంటారా, ఏ దెబ్బలాటా లేకుండా? ఉండరు ఉండలేరు. వాళ్ళకి దెబ్బలాడుకోనిదే తోచదు. ఎటొచ్చి దీనినే మోడరన్ కవులు 'ప్రణయ కలహం' అన్నారు. అన్నా, తమ్ముడూ అయితే కుటుంబ కలహం. రాజా, రాజా మహా యుద్ధం! సరే. రాజ్యం దొరికిందయ్యా! పోరుతుంటారా? లేదు. అప్పుడు రాణీల కోసం కొట్లాట!"

లోపలి కెళ్ళాను. అతను కుర్చీలో కూర్చుని ఉన్నాడు. చుట్టూ ఒక పదిమంది ఉన్నారు. నన్ను చూడగానే అతను ఆగాడు. ఎవరో పరిచయం చేసింది—'చక్రవర్తి.'

"నేను చక్రవర్తినండి! అంటే ఏ దేశానికి నేను చక్రవర్తిని కాదు సుమండీ! నా స్వంత సామ్రాజ్యానికి నేను చక్రవర్తిని. మీ రెవరో తెలుసుకోవచ్చునా అయ్యా?" అని అడిగాడు.

"నా పేరు రాంబాబు. మీకు వరసకి మావయ్యని ....."

"ఓ! రాంబాబుగారా! దయచేయండి, దయచేయండి! ఆహా ఓహో, ఆహా ఓహో! కూర్చోండి మిమ్మల్ని గురించి ఎప్పుడూ వినడమే కాని, చూడటం పడలేదు. మా నాన్నగారు చెబుతోండే వారు అప్పుడప్పుడు."

నా జేబులో ఉన్న డిటెక్టివ్ పుస్తకంమీద అతని దృష్టి పడింది "నాకీ డిటెక్టివ్ పుస్తకా లంటే వళ్ళు మంటండీ అసలు ఇప్పటి కథ లంటే కూడా పరమ చికాకు. ఏదో ఇంగ్లీషు కథ తీసుకుని మక్కీకి మక్కీ కాపీ కొట్టేస్తారు మనవాళ్ళు. నాకా పాతవాళ్ళే నచ్చారు. విశ్వనాథ సత్యనారాయణ, గురజాడ — వీళ్ళండి అసలు రచయితలంటేను! నా బుక్ రాక్ చూడండి. ఫుల్ ఆఫ్ దోజ్ గుడ్ వోల్డ్ బుక్స్!" అన్నాడు.

"ఇప్పటి కథలు క్రైటీగా హ్యూమరస్‌గా ...."

నా వాక్యం పూర్తవకుండానే అతనందుకున్నాడు.

"నా మొహం హ్యూమరండీ! ఇప్పటి వాళ్ళకి హ్యూమర్ అంటే ఏమిటో తెలుసా అని! జోక్ చేస్తే నవ్వడం చాతకాదు ఇప్పటి వాళ్ళకి గురజాడ, భమిడిపాటి— వాళ్ళదండీ హ్యూమరస్ స్టైల్ అంటేనూ! వాళ్ళదాంట్లో ..."

"వాళ్ళతో సమానంగా మోడరన్ వాళ్ళలో వోడ్ హవుస్ ...." అనబోయాను.

"అతను ఇంగ్లీషువాడండీ! తెలుగువాడు కాదు. ఇంగ్లీషు రచనల్లో నాకు పాతవాటి కంటే కొత్తవే ఎక్కువ నచ్చుతాయి. డబల్‌యూ డబల్‌యూ జాకబ్స్ చూడండి! చాలా మంచి హ్యూమరిస్ట్. చార్లెస్ డికెన్స్ ఒకడు. పాతవాడయినా పిక్‌విక్ పేపర్స్‌లో అతను ...." ఇంకా ఏదో చెప్పుకుపోతున్నాడు.

వసంతకేసి చూశాను. "చూశావా అతని పిచ్చి వాగుడు" అన్నట్లు. కాని ఆమె ఇటువైపు చూడటంలేదు. అతని వాగుడుని శ్రద్ధగా వింటోంది. అతనికి తెలియని విషయం ఒకటి మొదలుపెట్టి అతని ధోరణి అపుదా మనిపించింది. ఇతని వాలకం చూస్తే సీరియస్ నోవల్స్ ఏవీ చదివినట్లు కనిపించటంలేదు. ఒక రచయిత పేరు చెప్పి చూద్దాం. 'సి ....' అతను వినిపించుకునే పరిస్థితిలో లేడు. అసలు ఊపిరి తీసుకుంటున్నాడా అనే అనుమానం వచ్చింది నాకు. ఏదో మంచి పాయింటు వేశాననుకున్నట్లున్నాడు— ఆగి అందరికేసి చూశాడు. ఇదే సమయమని గొంతు సర్దుకుని "సామర్‌సెట్ ..." అనబోయాను. కాని, అతను అందేసుకున్నాడు.

"మామ్ రచనలండీ అసలయిన రచనలంటే. ఏదయినా వర్ణించాలంటే అతనే వర్ణించా ముఖ్యంగా మనుష్యుల్ని, ఆర్డినరీ పీపుల్, ఎవ్వ షళ్ళి తెలుగువాళ్ళు తమ కథలో హీరో హీ యిన్స్‌ని అసాధారణమైన వ్యక్తుల క్రింద, అతి సౌందర్యవంతులుగా, అన్నివిధాలా 'ది బెస్ట్' అని అభి ప్రాయం వచ్చేటట్లు రాస్తారు. ఇది నాకు ఇష్టం ఉండదు. అతి మంచివాళ్ళన్నా, అతి ధైర్యవంతు అన్నా, అతి తెలివైనవాళ్ళన్నా నాకు కిట్టదు. 'దీనికి కారణం ఇవేమీ నీలో లేకపోవడమే' అని మీరంటే నేనేమీ అభ్యంతరం పెట్టను కాని, ఓనెస్ట్‌లీ స్పీకింగ్, మరీ అందమైన అమ్మాయిలంటే నాకు భయం. 'ప్రపంచంలో మరీ అందమైనవి ఎందుకూ పనికి రానివి—ఉదాహరణకి నెమలి, మొదలయినవి' అన్నాడు రస్కిన్. నెమలిలాగ అంత అందమయిన అమ్మా యికి కంఠం కూడా నెమలి లాగే ఉంటుందని నా అభిప్రాయం. అందుకే భయం. మోరోవర్ అన్నివిధాలా మంచివాళ్ళసలు ఈ ప్రపంచం లోనే ఉండరని అనుకునే వాళ్ళల్లో నే నొకడిని. ఇదంతా ఇప్పుడెందుకు కాని, ఇంతకీ చెప్పు దేని

అంటే మామూలు వాళ్ళు ఈ వర్ణనంతా ఒక పేజీలో రాసిపారేస్తారు. అది అంత ఇంప్రెసివ్‌గా ఉండదు. మాకు కథలలో కూడా నాయిక చాలా అందమైనదే. కాని అతను ఆ అందాన్ని గురించి ఒకే పేజీలో గుప్పెత్తి రాసెయ్యకుండా, తమాషాగా, ఒక పుటలో జుట్టుని, మరొక పుటలో కళ్ళని—అలాగ ఆ అమ్మాయిని గురించి ఒక్కొక్క పుటలో కొద్ది కొద్దిగా చొప్పున వర్ణించి, చివరికి ఆ అమ్మాయి చాలా అందమైనది అన్న 'భ్రమ'ని కలుగజేస్తాడు. అదీ అతనిలో ఉన్న బ్యూటీ ! ఇంకా అతనిలో ఉన్న విశేష మేమిటంటే "

ఇతను అన్ని రకాల పుస్తకాలనీ క్షుణ్ణంగా చదివేసినట్లున్నాడు. ఏదయినా ఇంకొక విషయం గురించి మాట్లాడాలి. ఆలోచనలో పడ్డాను. అతను తెగ మాట్లాడేస్తున్నాడు. నా ఆలోచన కూడా సాగటంలేదు. గొప్ప చిక్కే వచ్చింది ! ఎలా ఎలా ?

ఇంతలో అత్తయ్య వచ్చి 'భోజనానికి లేవండ్రా'' అంది. అందరూ లేచారు నేనూ లేచాను. అక్కడ తీరిగ్గా ఆలోచించవచ్చు.

"నాకు మన భోజనమంటేనే ఇష్టమండీ ! నార్త్ఇండియన్ పీపుల్‌కి అసలు భోజన మంటేనే ఏమిటో తెలియదు. ఎప్పుడూ పప్పూ అన్నమే తింటూ ఉంటారు. వెరైటీ ఉండదు. మనకి చూడండీ ! సాంబారూ, చారూ, పచ్చళ్ళూ—లక్షా తొంభయి. " వాగుకుంటూ వస్తున్నాడు వెనకాల —బృందంతో సహా !

భోజనాల కోసం టేబిల్స్ ఎరేంజ్ చేశారు పోయి చివర టేబుల్ దగ్గర కూర్చున్నాను అతను తన బృందంతో సహా నా దగ్గరికి వచ్చాడు "మీరు మా అతిథులు. చీఫ్ గెస్ట్. నేను హోస్ట్‌ని. కాబట్టి నేను మీ దగ్గరే కూర్చోవాలి." కూర్చున్నాడు బృందం అంతా కూడా అక్కడే జేరింది.

"పెళ్ళిళ్లంటే కూడా మనవేనండీ. ఆ బెంగాలీ వాళ్ల పెళ్లిళ్లు చూడండి—ఒక్కరోజు. అసలు పెళ్లి ఎటెండ్ అయినట్లే ఉండదు ....'' చెప్పుకు పోతున్నాడు.

లాభంలేదు. ఇతను ఎవ్వరినీ మాట్లాడనివ్వడు. సరికదా, చివరికి ఆలోచించ నిచ్చేటట్లు కూడా లేదు. ఇంతమంది ఉన్నారు ఒక్కళ్ళూ మాట్లాడడానికి ప్రయత్నించరేం ? అందరూ ఏకమైతే, అతని నోరు కట్టెయ్యవచ్చు. కానీ అంత కలయిక తెలుగువాళ్ల కేదీ ?

పైగా అందరూ అతని మాటలు విని ఆనందిస్తున్నట్లే తోస్తోంది ముఖ్యంగా వసంత. నిజం చెప్పొద్దూ ! నాకు కొద్దిగా ఈర్ష్య కలిగింది అందరూ అతని పట్ల ఆశక్తి చూపిస్తున్నందుకు కాదు వసంత ఆసక్తి చూపిస్తున్నందుకు. ఏమైనా సరే అతని నోరు కట్టెయ్యాలి

ఉన్నట్టుండి ఒక మంచి ఆలోచన తట్టింది సినిమాల గురించి మాట్లాడితే ? తెలుగువి, ఇంగ్లీషువి కావు అవి అతను తప్పకుండా చూసే ఉంటాడు బెంగాలీ వాటి గురించి ఖరగ్‌పూర్‌లో ఇంజినీరింగు చదవటం మూలాన్ని నేను బెంగాలీ నేర్చుకోవటం సంభవించింది అందువలన ఆ సినిమాలు చాలా నే చూశాను. బెంగాలీ నేర్చుకోవడం ఎంత మంచిదయింది ? అతను మాట్లాడటం అవగానే సినిమాల గురించి మొదలుపెట్టేస్తా.

సావుగంట తరువాత మంచినీళ్ళు త్రాగడానికని ఆగాడు. "సినిమాలు మీరు చూస్తారా ?" అని అడిగాను. చూస్తానన్నట్లు తల వూపి త్రాగుతున్న మంచినీళ్ల గ్లాసు ప్రక్కన పెట్టేసి "సినిమాలు చూ డ ని వా డు మనుష్యుడనబడడు ఈ కాలంలో ......"

"తెలుగువి కావు ....."

"తెలుగువని ఎవడన్నాడండీ ! తెలుగు సినలు నేను చూడను చూస్తే బెంగాలీవి చూడాలి. మొన్న 'ఖుదితో పాషాన్' చూశాను ....'' చచ్చాం! ఇతను బెంగాలీ సినిమాలు కూడా చూశాడు కాని పరవాలేదు. తెలుగువి చూడలేదంటున్నాడు. వాటిని గురించి మాట్లాడుతే సరి ! కాని ఏం లాభం ? సమయం దాటిపోయింది. అతను వినిపించుకునే స్థితిలో లేడు. బెంగాలీ సినిమాలని వర్ణించేస్తున్నాడు.

భోజనాలయాయి ఎందుకో ఆగాడు.

"తెలుగువి కూడా చాలా బాగుంటాయండి మీరు చూడనంటున్నారు కాని ...." నా వాక్యాలు పూర్తయే ప్రాప్తం లేదు ఇవాళ అతను అందేసుకున్నాడు. "చూడలేదని ఎవడన్నాడండీ ? చూశాను. కాని బెంగాలీవి, ఇంగ్లీషువి చూసినన్ని చూడలేదు. అంతే. అసలు మనవాళ్లకి డైరెక్షన్ తెలియదండీ. పోనీ బెంగాలీవాళ్ల నయినా చూసి నేర్చుకోరు. ఒక్క స్టోరీ వాల్యూ తప్ప ఇంకేమీ ఉండదు. ఆ స్టోరీ కూడా ఏ బెంగాలీ సినిమాలోంచో కాపీ చేసినదై ఉంటుంది. ఫలానా సినిమా చూశాను ఆ హీరో నలభయి ఏళ్లవాడు కాలేజీ స్టూడెంట్ లాగ బయలుదేరుతాడు ఏమన్నా నాచురల్‌గా ఉందా ? సరే ! ఇంక ఆ హీరోయిన్ ఉంటుంది—రెండువందల ఏభయి పౌన్లు ...."

చుట్టూ చూశాను వెంకట్రావు భుజంమీది మంచి కెమేరా వేళ్లాడుతోంది. అదీ ! ఫొటోగ్రఫీ గురించి మాట్లాడుతాను ఇరవయి నిమిషాల తరువాత అవకాశం లభించింది. "ఏం కెమేరాహోయ్ అది?" అని అడిగాను వెంకట్రావుని చెబుదామని నోరు తెరిచాడు.

ఇంతలో అతను అందుకున్నాడు. "మినోల్టా ఏ ఫయివ్ అండీ. దాని షేప్ చూస్తే తెలియటం లేదూ ? .. "

ఈ శనిగ్రహం గాడికి ఫోటోగ్రఫీ కూడా తెలుసా ? ఇంకేం దారి ?

అతను మాత్రం వాగుకుపోతున్నాడు ". నా దగ్గర కూడా ఒక కెమేరా ఉంది. యాషికా ఫ్లెక్స్—యాషికోర్ లెన్స్—త్రీ పాయింట్ ఫైవ్ యాషినాన్ లెన్స్‌ది దొరుకుతుందేమో అని ట్రయ్ చేశాను కాని దొరకలేదు అసలు నన్నడుగితే జైస్ కెమేరాలండీ కెమేరాలంటే ! ఈ జపనీస్ కెమేరాలు మంచివే కాని ఆ జైస్ కెమేరాలలో ఉన్న పెర్‌ఫెక్షన్ ఇంక ఏ కెమేరాల్లోనూ ఉండదు ఫొటోగ్రఫీ నా హాబీలెండి ఎ జైస్ కెమేరా విత్ ఎ టెస్సార్ లెన్స్ ఎండ్ ఎ సింక్రో కాంపూర్ షట్టర్—అంటే మనం కళ్ళు మూసుకుని కొనొచ్చు అంత ఫ్లాలెస్‌గా ఉంటాయి అవి. కోంటేక్స్ చూడండి! ఇట్ ఈజ్ ది బోస్ట్ కెమేరా విత్ ఎ మెటల్ ఫోకల్ ప్లేన్ షట్టర్. లైకా కూడా ఎందుకూ పనికి రాదు దాని ముందర. మా ప్రొఫెసర్ దగ్గరఒకటి ఉండేది. అసలు ఫోకల్‌ప్లేన్ షట్టర్ అంటేనే "

వసంతకేసి చూశాను. వాడు చెప్పేది శ్రద్ధగా వింటోంది. "వసంతా ! అలా పార్కులోకి వెళ్లి వద్దామా ?" అన్నాను.

ఆ శనిగాడు వినేశాడు "నేనూ వస్తా పార్కులోకి. అసలు ప్రతి మనిషికీ రోజూ కొంత నడక అవసరం. రోజూ ప్రొద్దుట సాయంత్రమూ రెండు మైళ్ళు, రెండంటే రెండు మైళ్లు నడుస్తే చాలు. హెల్త్ ఎంత బాగుంటుందనుకున్నారు ? ఒక్క ఫర్లాంగు కూడా నడిచి వెళ్ళరు మన వాళ్ళు. రిక్షా ఎక్కవలసిందే అందుకే మనవాళ్ల హెల్త్స్ అలా అఘోరిస్తూ ఉంటాయి. నా హెల్త్ చూడండి ! నా బరువు నూట నలభయి ఐదు పౌన్లు. ఈ నడక ఒకటే కాకుండా రోజూ సాయంత్రం ఏభయి దండీలు,వంద బస్కీలు తీస్తాను ఇవి కాకుండా చెస్ట్ ఎక్స్‌పేండర్ కూడా ఉపయోగిస్తాను. అసలు మంచి ఫిజిక్‌కి "

పార్కుకి వెళ్లాము. ఒక సావుగంట కూర్చున్నాము అంతసేపూ అతను మొక్కల గురించి, పువ్వుల గురించి లెక్చరు దంచుతూనే ఉన్నాడు. అదంతా వ్రాయడం నాతరంకాదు

వెనక్కి బయలుదేరాము. వసంత, లక్ష్మి కొంచెం వెనక బడ్డారు "ఇంతేనండి ఈ ఆడవాళ్ళు ! ప్రతి దాంట్లో మగవాళ్లతో సమానంగా ఉంటామని బయలుదేరుతారు. తీరాచూస్తే గట్టిగా నడవలేరు ఆఫీసుల్లో పనిచేసే ఆడవాళ్లు పదింటికి ఆఫీసయితే అధమం ఏడింటికయినా ఇళ్ళనుంచి బయలుదేరుతారనుకుంటాను. లేకపోతే వాళ్లు లంచవర్‌కి గాని ఆఫీసుకి జేరుకోలేరు. అందుకే 'ది వీకర్ వెసెల్' అన్నా డెవడో. పోనీ వాళ్లకి బుర్రలయినా ఇచ్చాడా దేముడు అంటే అదీ లేదు. 'వై డూ గర్ల్‌స్ క్యారీ సోమెనీ బుక్స్ విత్ దెమ్ ?' అని అడుగుతే 'బికాజ్ దే క్యారీ లెస్ ఇన్ దేర్ బ్రెయిన్స్' అన్నాడుట "నో వుమన్ ఈజ్ ఎ జీనియస్. ఉమెన్ ఆర్ వోన్‌లీ ఎ డెకొరేటివ్ సెక్స్' అని ఆస్కార్ వైల్డ్ అన్నాడు. 'ది కెపేసిటీ ఆఫ్ ఏ ఫీమేల్ బ్రెయిన్ ఈజ్ టెన్ పర్సెంట్ లెస్ దేన్ దట్ ఆఫ్ ఎ మేల్ బ్రెయిన్' అని మెడికల్ చదువుతున్న వాళ్ళు చెబుతూనే ఉన్నారు ! ఇంకా చెప్పాలంటే, కోలే అన్నట్లు 'బట్ వాట్ ఈజ్ ఎ వుమన్ ? వోన్‌లీ వన్ ఆఫ్ నేచర్స్ ఎగ్రీయబుల్ బ్లన్‌డర్స్' ... "

ఆడవాళ్ళ గురించి కొటేషన్స్ దంచేస్తున్నాడు. ఇంటికివచ్చి అందరము అక్కడ ఉన్న జంబుఖానా మీద కూర్చున్నాము గోడకి ఆనుకుని, ఆ సాగుతున్న శబ్ద ప్రవాహానికి మైమరచి ఒక చిన్న కునుకు తీశాను అరగంట తరువాత మెళకువ వచ్చింది. అతనింకా ఆడవాళ్ళని దూది ఏకుతున్నట్టు ఏకుతూనే ఉన్నాడు " 'స్త్రీ ఈజ్ ఈక్వెల్ టు వన్' అని ఋజువు చెయ్యగలం కాని మహాప్రభో, పెళ్లాం చెప్పినది తప్పని ఋజువు చెయ్యలేము. పైగా ఈ ఆడవాళ్ళంతా మొగుళ్ళ చేతుల్లో అష్ట కష్టాలు పడిపోతున్నట్లు ఏడుస్తారు " మొగవాళ్లు వింటున్నారు, బాగానే ఉంది. కాని ఆడవాళ్ళు కూడా మాట్లాడకుండా

వింటున్నా రేమిటి ? వాళ్ళని [illegible] తిరిగి అతి [illegible]. మళ్ళీ ఆలోచన మొదలుపెట్టాను. ఇంక మనుష్యుల గురించి లాభంలేదు. జంతు జాలం గురించి మొదలెట్టి చూస్తాను.

ఎవరో తుమ్మితే అతను అడిగాడు. "చిరంజీవ" అన్నాను. "అసలు ఈ తుమ్మగానే దీవించడం అనేది ..." చచ్చాం ! ఇంక తుమ్ము గురించి లెక్చర్ కాబోలు !

"మేమొక అల్సేషియన్ కుక్కని పెంచు తున్నాము" సందర్భం లేకపోయినా మధ్యలో అనేశాను.

"ఈ కుక్కల్ని పెంచడ మొక ఫేషనయిపోయిందండీ ఈమధ్య. ఒక్క కుక్కని ఇంట్లో ఉంచుకోవటం, 'బివేర్ ఆఫ్ ది డాగ్స్' అని బోర్డు గేటుమీద ! ఒక్క కుక్క ఉన్నా సరే "

"జంతువులు, ముఖ్యంగా వైల్డ్ ఏనిమల్స్ " మళ్ళీ ఒక విఫల ప్రయత్నం చేశాను.

"వైల్డ్ లైఫ్‌ని గురించి ఆమధ్య కొన్ని పుస్తకాలు చదివానండి కొన్ని కొన్ని జంతువుల స్వభావాలు విచిత్రంగా ఉంటాయి. టేక్‌ఫర్ ఇన్‌స్టెన్స్—చితా. చాలా ఇష్టం నాకు. చంపబోయే ముందు అవతలి జంతువుకి వార్నింగిచ్చి అప్పుడు చేజ్ చేసి మరీ పట్టుకుంటుంది అవసరం వచ్చినప్పుడు అది గంటకి ఏనభయి మైళ్ళ స్పీడ్ మీద కూడా పరిగెట్టగలదు ... "

"అబ్బా !" సభలో ఒక కంఠం.

" . మనవాళ్ళు ఫూలిష్ పీపుల్ లేడి అన్నిటికంటే త్వరగా పరిగెట్టగలదని అంటారు కాని, చీతా, లేడీని రెండు నిమిషాల్లో తరిమి పట్టుకోవడం నేను కళ్ళారా చూశాను అంటే నిజంగా కాదనుకోండి, సినిమాలో ..."

ఇంకా ఏమి టాపిక్స్ ఉన్నాయి ? సమయాని కొకటీ జ్ఞాపకం రాదు. షూటింగు గురించి మాట్లాడుతే ? ఎలాగో వీలు చూసుకుని "తుపాకీ" అనగలిగాను.

"ట్వెల్వ్ బోర్ గన్ అండీ ! షూటింగ్‌కి ఐడియల్ ....."

"ఏం బోరుగన్నో ! నువ్వు మాత్రం తెగ బోరు కొడుతున్నావు" బయటికనే ధైర్యం లేక

# విజ్ఞుడు

[illegible]తో అనుకున్నాను.

"…. బాగా పెద్దసైజు పెద్ద పులి కూడా దానితో చచ్చిపోతుంది. అంటే రాయల్ బెంగాల్ టైగర్, మొదలయినవన్నీ కూడా చచ్చిపోతాయి. రికోయిల్ కొంచెం హెచ్చుగా ఉంటుందనుకోండి. అయినా ఫరవాలేదు బై దవే మీరెప్పుడయినా షూటింగ్‌కి వెళ్ళారా ? వెడితే ఎప్పుడూ ఇండియన్ మేడ్ గన్‌ని తీసుకు వెళ్ళకండి. అది సమయానికి ఫయిర్ అవుతుందో లేదో తెలియదు విన్‌చెస్టర్ కాని, బ్రవునింగ్ కాని తీసుకు వెళ్ళండి. ఇంకొక మాట ....."

అసలు అతని నోరు కట్టుదామనుకోవటం నాదే బుద్ధి పొరబాటు. అతనికి తెలియని విషయం లేదు. అతనిని ఆపడం ఎవరి తరమూ కాదు. ఇక్కడినుంచి లేచి వెళ్ళిపోతే మంచిది లేచాను.

"ఎక్కడికి ?" అడిగాడతను.

"అబ్బే ! ఏంలేదు ఉత్తినే అలా తిరిగి వద్దామని" అన్నాను.

"అదేమిటండీ ! మనమంతా సరదాగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటోంటేనూ! కాసేపు కూర్చోండి" అన్నాడు చెయ్యి పట్టుకుని లాగుతూ. కూర్చున్నాను.

మళ్ళీ మొదలుపెట్టాడు. "మీకు బోరు కొడుతున్నట్లు కనిపిస్తోంది కాబట్టి నాకు జరిగిన ఒక చాలా ఇన్‌టరెస్టింగ్ అనుభవం ఒకటి చెపుతున్నాను వినండి. వైల్డ్ లైఫ్ అంటే నాకు చాలా ఇష్టం అని చెప్పాను కదా ! ఐ సింప్లీ లవ్ ఇట్ ! అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది ఏ అడవిలోకో పోయి ఒక నెల్లాళ్ళు ఈ వైల్డ్ లైఫ్‌ని స్టడీ చెయ్యాలని కాని తీరికేదీ ? ఒకసారి ఆఫీసు పనిమీద నాన్నగారు బీహార్ వెడితే నేనూ వెళ్ళాను. అప్పుడు హజారీబాగ్ నేషనల్ పార్క్‌కి వెళ్ళాము. చీకటి పడగానే స్పాట్ లైట్ తీసుకుని జీప్‌లో బయలుదేరాము .. "

ఇప్పుడదంతా రాస్తానని మీరు భయపడకండి అతను మాట్లాడేవి వ్రాయటం మొదలు పెడితే ఏ పత్రికనయినా ఒక ఏడాది నడిపించవచ్చు ఇంక అతను చెపుతున్నది వినటం నాతరం కాదు. పోనీ వసంతతో నయినా మాట్లాడుదామంటే అవిడగారు ఇటువైపు చూడటమయినా లేదు. మిగిలినవాళ్ళందరూ కూడా అతని పిచ్చి వాగుడునే వింటున్నారు. పోనీ ఇంకొకచోటి కెక్కడికయినా పోదామన్నా అతడు వదలడు కదా.

తల పట్టుకుని కూర్చున్నాను.

"తల నొప్పాండీ ?" అడిగాడు పిచ్చివాడు.

"ఏస్ప్రో వేసుకో " అంది వసంత.

"నో యూజ్ అండీ. ఈ తలనొప్పి మాత్రలు పట్టే దండుగ. అవి వేసుకున్నామనే తృప్తి తప్ప తలనొప్పి, తలనొప్పిలాగే ఉంటుంది. బెస్ట్ వే ఏమిటంటే ....."

బాబోయ్ ! ఇంక వినలేను ఊపిరి ఆడటం లేదు నాకు. నీళ్ళల్లో తల ముంచేసి, ఆ తలని పైకెత్తకుండా గట్టిగా పట్టుకున్నట్లుంది "కీ" తరగని గ్రామఫోనతను. తుపాకీ నుండి వచ్చిన గుండుని ఆపడం ఎంత సులభమో, అతని వాగ్ధాటిని ఆపడం అంత సులభం ఇంక లాభంలేదు. సాయంత్ర మేమయినా బండీ ఉంటే ఇంటికి పోతా.

వసంత ఒక తలనొప్పి మాత్ర, ఒక గాజు గ్లాసులో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. మళ్ళీ మొదలుపెట్టాడు వాగుడురాయుడు. "నా కేమిటో ఈ స్టెయిన్‌లెస్ స్టీలు గ్లాసులన్నా, కంచాలన్నా పరమ అసహ్యం. వాటిల్లో బ్యూటీ ఉండదు. క్రోకరీ అంటే పోర్సిలిన్‌దయి ఉండాలి. అవి విరిగే అవకాశం లేకపోతే దనుకోండి అయినా వాటికున్న బ్యూటీ "

పావుగంట తరువాత ఆగాడతను ఎవరూ మాట్లాడలేదు అతను అందరికేసీ చూస్తున్నాడు ఎ వ ర యి నా ఏమయినా అంటే ఆ ముక్క పట్టుకుని లెక్చరు కొడదామనేమో! ఇప్పటి కెక్కింది ఈ మొద్దు బుర్రకి ! మనం అందిచ్చేమాట అతని గ్రామఫోనుకి 'కీ' లాంటిది ఆ 'కీ' నే ఇయ్యకుండా ఉంటే ?

బాగుంది ఈ ఐడియా మాట్లాడకుండ కూర్చున్నాను. చెయ్యి కదుపుతే ఆ కదలిక గురించి వాగేస్తాడేమో ! ఎందుకయినా మంచిదని కదలకుండా కూర్చున్నాను నా అదృష్టంకొద్దీ మిగిలిన వాళ్ళెవరూ కూడా మాట్లాడలేదు వాళ్ళకీ బోరు కొడుతోంది కాబోసు !

ఒక నిముషం గడిచింది నేనతన్ని కలుసుకున్న తరువాత ఒక నిముషం వరకు అతను మాట్లాడ కుండా ఉన్నది ఇదే మొదటిసారి బ్రతికాం ఇంక మాట్లాడడు మాట్లాడలేదు

విజయగర్వంతో ఒకసారి వసంతకేసి చూశాను కాని ... ఇంతలో .

"మనం నోరు మూసుకుని కూర్చుంటే అందరూ మనని ఫిలాసఫర్ అనుకుంటారని లాటిన్ ప్రోవర్బ్ ఒకటి ఉంది నాకు—సప్ హవ్—ఫిలాసఫీ అంటే అంత ఇష్టంలేదు బియర్స్ అన్నట్లు ఫిలాసఫీ అంటే 'ఏ రూట్ ఆఫ్ మెనీ రోడ్స్ లీడింగ్ ఫ్రమ్ నోవేర్ టు ' ."

వీడు ఆగడు వీడిని ఆపడం నా తరంకాదు బుద్ధిలేక వచ్చాను ఇక్కడికి నాకు మోక్షంలేదా పరమేశ్వరా ?

ఆ రాత్రి సినిమాకని అందరూ బయలుదేరితే నేనూ కదిలాను. మర్నాడు ప్రొద్దుట నేను కనపడలేదని అంతా వెతుక్కున్నారట. ఇం

[illegible] ? – [illegible] ?

